## క్లుప్తంగా

### నిరుద్యోగ యువతకు ఉపాధి

**గుండాల:** ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కనిపిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ తాటి మల్లేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, సోలార్, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమొబైల్, బ్యూటీషన్ విభాగాల్లో శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో యూనిఫాం, బూట్లు, వసతి, ఆహారం తదితర సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. ప్రతినెలా 1వ, 15వ తేదీల్లో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ తర్వాత ఉద్యోగం, సర్టిఫికేట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### డైవర్షన్ పనులు అడ్డగింత

**దుమ్ముగూడెం:** మండలంలోని తూరుబాక గ్రామంలోని కుంగిపోయిన కల్వర్టు నిర్మాణ పనుల దగ్గర చేపట్టిన రోడ్డు డైవర్షన్ పనులను సంబంధిత స్థలానికి చెందిన వ్యక్తులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. కేవలం కల్వర్టు పూర్తి అయ్యే వరకే ఈ రహదారిని ఉపయోగించనున్నట్లు వివరించడంతో ఆందోళనకారులు వెనక్కితగ్గారు. దీంతో యథావిధిగా రోడ్డు డైవర్షన్ పనులు కొనసాగాయి.

### రేపు దివ్యాంగుల బస్‌పాస్‌ల క్యాంపు

**దుమ్ముగూడెం:** మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీన దివ్యాంగుల బస్ పాస్ క్యాంపు నిర్వహించనున్నట్లు భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దుమ్ముగూడెం మండలంలోని అర్హులు సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు 2తో హాజరు కావాలని, ఒక పాస్ ధర రూ.50 అని తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి

**అన్నపురెడ్డిపల్లి:** వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని సందర్శించి, ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, వ్యాధి నిరోధక టీకాలు నిల్వ చేసే ఐఎల్ఆర్ రూంను పరిశీలించారు. అనంతరం కట్టుగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారాలు డాక్టర్ ప్రియాంక, తన్మయి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జీఓ 25ను సవరించాలి

**దుమ్ముగూడెం:** ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణపై ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు (వర్క్ అడ్జెస్ట్మెంట్) విడుదలైన జీవో నెంబర్ 25 ఉత్తర్వులను సవరించాలని జాక్టో రాష్ట్ర కో చైర్మన్, ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు డిమాండ్ చేశారు. శనివారం మారాయిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిసరన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర ట్రెజరర్ సోయం హనుమంతరావు, మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి పూనం రమేష్, సోడి సత్యప్రసాద్ రావ్,తుర్రం నరసింహారావు, గొర్రె రామకష్ణ, వర్ష సీతయ్య, పూనం హిందులత, అపక బాలరాజు, సోడి రాంబాబు, బోదెబోయిన కాంతారావు పాల్గొన్నారు.

### మద్దతు ధర కల్పించాలి

**దుమ్ముగూడెం:** రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు, మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మహాదేవపురం, కాటాయిగూడెం మహాసభల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, శ్రీనుబాబు, కాక కృష్ణ, మర్మం సమ్మక్క, లింగరాజు, వీరభద్రం, నాగరాజు, శ్రీరాములు, మడివి ధర్మయ్య, నూపా మహేష్, రమేష్, విజయలక్ష్మి, కమల పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని ఐఎఫ్‌టీయూ అధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎస్‌కే రహిమత్, ఉపాధ్యక్షురాలుగా వూకే నాగమణి, ముజాహిద్దీన్, కార్యదర్శిగా తగరం శోభారాణి, సహాయ కార్యదర్శిగా ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్గనైజర్ కార్యదర్శిగా వెంకటకృష్ణ, కోశాధికారి నార్లపాటి సుజాతతోపాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి షేక్ యాఖుబ్ అలీ, ప్రజాపంథ పాల్వంచ డివిజన్ నాయకుడు గోగినపల్లి ప్రభాకర్ మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లు గొంది లక్ష్మణ్‌రావు, గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

# పార్టీలో అందరూ సమానమే..

- వర్గబేధాలు లేకుండా ముందుకు సాగాలి
- కమిటీలు వేసి సమస్యలు పరిష్కరిస్తాం..
- ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అశ్వారావుపేటరూరల్:** కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త అంతా తనకు సమానమేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. పార్టీలో వర్గాలు లేకుండా అంతా కలిసి ముందుకు వెళ్లాలని సూచించారు. త్వరలో జరిగే గ్రామ పంచాయతీలకు పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

**బయటపడిన వర్గపోరు..**

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సమక్షంలో వర్గపోరు బహిర్గతమైంది. ఎమ్మెల్యే ప్రసంగం ముగిసిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను మాట్లాడాలని సూచించారు. దీంతో ఒక్కొక్కరు మాట్లాడుతున్న క్రమంలోనే కొంతమంది నాయకులు మాట్లాడుతూ.. పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తున్నారని, కొత్తగా పార్టీలో మీతోపాటు వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని నిలదీశారు. అలాగే గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన వివరాల సమాచారాన్ని పాత నాయకులకు ఇవ్వడం లేదని వాపోయారు. దీంతో సమావేశం అంతా గందరగోళంగా మారగా.. ఇరు వర్గాల అరుపులు, తోపులాటతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇరు వర్గాలను శాంతియుతంగా ఉండాలని కోరగా, వాగ్వాదం మరింత ముదరడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వాగ్వాదం పడుతున్న వారిని అక్కడి నుంచి బయటకు పంపించారు. కాగా, సమావేశంలో నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

**ఫ్రెషర్స్ డేలో ఎమ్మెల్యే..**

అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ అనిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. లెక్చరర్లు సాయి, చాంద్‌పాషా, రాంబాబు, సత్యశ్రీధర్, అరవింద్ పాల్గొన్నారు.

**త్వరలోనే ఇందిరమ్మ కమిటీలు**

**దమ్మపేట:** త్వరలోనే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెల్లడించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకు వెల్లడించారు. అధికారులు మాట వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. త్వరలోనే మండల కమిటీలు ఏర్పాటు చేసి, అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని తెలిపారు. కాగా, తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ తుమ్మల వర్గం నాయకులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 900 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. లోక్ ఆదాలత్ ద్వారా సాయంత్రం 5 గంటల వరకు 900 కేసులు పరిష్కారమయ్యాయని, అలాగే కక్షిదారుల నుంచి బ్యాంక్‌కు రూ.81 లక్షల 50 వేలు వసూలు కాగా, జరిమానా కింద ప్రభుత్వానికి రూ.3 లక్షలు చెల్లించామని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మిద్దల సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ మధుసూదన శర్మ, లోక్ ఆదాలత్ సభ్యులు సింగారం మల్లేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి అర్చనలు, గోత్ర నామార్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ మేనేజర్ రమణ పాల్గొన్నారు.

### పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని గుమ్మడవల్లి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న బచ్చువారిగూడెం, కొత్తూరు, గుమ్మడవల్లి పాఠశాలలను అశ్వారావుపేట ఎంఈఓ పి.ప్రసాద్‌రావు శనివారం సందర్శించారు. పాఠశాలల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా వడ్డించారు. అనంతరం ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి నూతనంగా ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు, టీచర్లు, సీఆర్పీ మాలోతు రామారావు పాల్గొన్నారు.

### విద్యార్థినుల శ్రమదానం



స్వచ్ఛతా హీ సేవాపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న ట్రైబల్ వేల్ఫేర్ కళాశాల వద్ద శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐటీసీ వావ్ సంస్థ (ఈశ్రీ–ఫౌండేషన్) ఆధ్వర్యంలో విద్యార్థినులు శ్రమదానం చేశారు. కళాశాలలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొని మాట్లాడారు. వావ్ సంస్థ కో–ఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి, సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది పాలొన్నారు.

### ఇసుక రవాణా

**ములకలపల్లి:** మండలపరిధిలోని కొత్తూరు శివారులోని సీతారామ కాలువ సమీపంలో ఇసుక తోలకాలు చేసి, నిల్వ చేస్తున్నారు. ఈ డంప్‌ల నుంచి లారీల్లో లోడుచేసి పట్టణాలకు తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల ఉదాసీనతే అక్రమ తోలకాలు కారమని ఆరోపణలు వినవస్తున్నాయి.

### తప్పుడు ప్రచారం సరికాదు

**అశ్వాపురం:** నెల్లిపాక సహకార సంఘం మహాజన సభపై తప్పుడు ప్రచారం తగదని, ఈ నెల 26న మహాజన సభ కోరం పూర్తి కానందున అక్టోబర్ 17కి వాయిదా వేశామని నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంటలోని సహకార సంఘం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023–24 ఆడిట్ రిపోర్ట్, మల్లెలమడుగులో గోదాంను ఫంక్షన్‌హాల్‌గా మార్చడానికి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సంఘం కార్యాలయానికి సంబంధించిన నెల్లిపాక బంజరలోని ఎకరం 30 గుంటల భూమిపై స్థానిక తహసీల్దార్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం సీఈఓ వెంకట్, డైరెక్టర్లు పినికేసి సుధాకర్‌రెడ్డి, కోడి వెంకన్న, నరసింహారావు, నరసింహులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లో కనెక్షన్లు..



గుమ్మడవల్లికి చేరిన కరెంట్ స్తంభాలు

సాక్షి ఎఫెక్ట్..

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు, పెదవాగు వరద కారణంగా దెబ్బతిన్న త్రీఫేజ్ కనెక్షన్‌లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను మరో పది రోజుల్లో పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో డీఈఈ నందయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం 'సాక్షి' దినపత్రికలో 'త్రీఫేజ్ తిప్పలు' శీర్షికన వచ్చిన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. డీఈఈ నందయ్య స్థానిక ఇన్‌చార్జ్ ఏడీఈ లక్ష్మణ్‌తో కలిసి గుమ్మడవల్లి గ్రామంలోని బాధిత రైతుల వద్దకు సమస్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పునరుద్ధరించేందుకు అంచనాలు వేశారు. తక్షణమే గుమ్మడవల్లిలోని 19 మంది రైతులకు సంబంధించిన త్రీఫేజ్ లైన్లు, కనెక్షన్లు ఇచ్చేందుకు అవసరమైన సామగ్రితోపాటు 70 కరెంట్ స్తంభాలను రప్పించారు. కరెంట్ స్తంభాలు వేసేందుకు మార్కింగ్‌లు వేయించి, ఆదివారం ఉదయం నుంచి పనులు మొదలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్ని త్రీఫేజ్ కనెక్షన్‌లను మరో పది రోజుల్లో పూర్తి చేస్తామని డీఈఈ 'సాక్షి'కి తెలిపారు. ఏఈఈ సంతోష్, సబ్ ఇంజనీర్ విజయ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

### రక్షణ, భద్రతపై అవగాహన

**మణుగూరుటౌన్:** పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆశ్రమ గర్ల్స్ హాస్టల్, మణుగూరులో మహిళల భద్రతపై సీడీపీఓ జయలక్ష్మి అవగాహన కల్పించారు. శనివారం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు, మానసిక శారీరీక ఎదుగుదలలో భాగంగా తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పోషణ మాసోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర ప్రదర్శన

**మణుగూరురూరల్:** జమాతే ఇస్లామే హింద్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అంబేడ్కర్ సెంటర్‌లో మహమ్మద్ ప్రవక్త బోధనలను, జీవిత చరిత్రను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామే హింద్ మణుగూరుశాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహీం మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త బోధనల ప్రాముఖ్యతను వివరించారు. ప్రదర్శనలో భాగంగా బోధన కరపత్రాలను, పుస్తకాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, నిజాముద్దీన్, సయ్యద్ ఉమర్, చాంద్‌పాషా, మల్బూర్, అల్తాఫ్, మజీద్ అధ్యక్షులు, మిల్లత్ కమిటీ అధ్యక్షులు ఇస్మాయిల్, కార్యదర్శి సిరాజ్ పాషా, జి.వెంకటేశ్వర్లు, పాక వెంకటేశ్వర్లు, జాన్, వెంకటరత్నం పాల్గొన్నారు.

### ఘనంగా ఫ్రెషర్స్ డే

**ములకలపల్లి:** మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిన ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లెక్చరర్లు అజహర్ అలీ, రామకృష్ణ, చంద్రమౌళి, చంద్రశేఖర్, రాజేశ్వరి, సుచరిత, రాణి, ముత్యాలు పాల్గొన్నారు.

### పోస్టర్లు ఆవిష్కరణ

**గుండాల:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఏర్పడి అక్టోబర్ 12, 13 తేదీలతో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గోడ పత్రికలను జూనియర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ మాట్లాడారు. నాయకులు రామకృష్ణ, అఖిల, దీపిక, వివేక్, శ్యామల పాల్గొన్నారు.

### గుర్రం జాషువా జయంతి

**మణుగూరురూరల్:** మండలంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జాషువా చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. సంఘ సంస్కరణలే లక్ష్యంగా సాహిత్యాన్ని సృష్టించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని ఆయన కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాలియా, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సాంబమూర్తి, రామతిరుమతి, బూర్గుల సతీష్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

**దుమ్ముగూడెం:** గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు రాణించాలని ఇన్‌చార్జ్ ఇంటర్మీడియట్ అధికారిణి సులోచనరాణి పిలుపునిచ్చారు. శనివారం కాలేజీలో జరిగిన ఫ్రెషర్ డే వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గతంలో కాలేజీలో చదివిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించారని తెలిపారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేసి విద్యార్థులు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సమకూర్చే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, టీజీఓ అధ్యక్షుడు వెంకటపుల్లయ్య, జిల్లా కాలేజీల ప్రిన్సిపాల్ అధ్యక్షుడు శేషుబాబు, సెక్రటరీ శంకర్, యండి.ఖుర్షీద్ అహ్మద్, గ్రామ పెద్దలు, కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

**గుండాల:** ఆళ్లపల్లి మండలం జాకారం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మహమూద్ పాషా ఇటీవల హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత పాషాను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆళ్లపల్లి ఏఎస్ఐ వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు హెచ్‌సీ కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, చంద్రశేఖర్, పీసీఎం శ్రీనివాస్ ఉపేందర్‌లతోపాటు పలువురు అధికారులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుడికి సంతాపం


**కరకగూడెం:** ములకలపల్లి మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్మికుడు పోడియం నారాయణ రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంపై మండలంలోని పలు గ్రామ పంచాయతీల సిబ్బంది శనివారం కరకగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలుగా మృతుడి కుటుంబానికి అండగా నిలబడాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇల్లందుల పిచ్చయ్య, జిల్లా నాయకులు గుమ్మడివెళ్లి కృష్ణ, కోశాధికారి ఉప్పల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి చర్ప సాంబశివరావు,కార్యదర్శి ధనుంజయ, కార్మికులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ తుది జాబితా ప్రదర్శన

**అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓటర్ తుదిజాబితాను అధికారులు ప్రదర్శనకు ఉంచారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన తుది ఫోటో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రచురించినట్లు ఎంపీఓ షబ్నా తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 16,627 ఉండగా పురుషులు 8,246, మహిళలు 8,381 ఉన్నట్లు ఆమె తెలిపారు.

**అశ్వారావుపేటరూరల్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల వారిగా సిద్ధం చేసిన ఓటరు జాబితాలను శనివారం ప్రదర్శించారు. అశ్వారావుపేట మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఓటరు జాబితను విడుదల చేసి, నోటిస్ బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా జీపీల కార్యదర్శులు ఓటర్ల జాబితాను నోటిస్ బోర్డులో ఉంచారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, కార్తీక్, బాబు, అలివేలు పాల్గొన్నారు.

### వృత్తి నైపుణ్యాలతో ఉపాధి



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

**బూర్గంపాడు:** యువత వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన జీవనోపాధులు పొందవచ్చని ఎంపీడీఓ జమలారెడ్డి అన్నారు. బూర్గంపాడులోని ఐటీసీ బంగారు భవిష్యత్ (మిషన్ సునేరికల్) ఆధ్వర్యంలో ప్రథమ్ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎలక్ట్రికల్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన 80మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ.. నిరుపేద, నిరుద్యోగ యువతకు ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్ సంస్థలు వృత్తి విద్యలో శిక్షణనివ్వటంతో పాటుగా ఉపాధులు కల్పించటం అభినందనీయమన్నారు. ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్ అధికారులు పాల్గొన్నారు.

### లోపాయికారి ఒప్పందంతోనే దాడులు

**మణుగూరుటౌన్:** బీఆర్ఎస్, బీజేపీ పార్టీల లోపాయికారి ఒప్పందాల్లో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఈడీ దాడులు జరిగాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2014లో కేంద్రలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 96శాతం ప్రతిపక్షాల మీదనే దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. బీజేపీ అక్రమ కేసులను తాము రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

### మంచినీటి సహాయకులకు శిక్షణ

**దమ్మపేట:** మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో నూతనంగా నియమించబడిన మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో తాగునీటి శాఖ సీఈ కాషా శ్రీనివాస్ మిషన్ భగీరథ డీఈ అభిషేక్, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఈఈ తిరుమలేష్, ఏఈ కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

### టీకాలు వేయించాలి

**భద్రాచలంఅర్బన్:** పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించాలని భద్రాచలం ఇన్‌చార్జ్ ఏడీ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని పశువైద్యశాలలో ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ పాల్గొని సుమారు 60 పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భద్రాచలం పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### వైద్య శిబిరం

**మణుగూరురూరల్:** మున్సిపాలిటీలోని ఆదర్శనగర్‌లో ఉన్న ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ బాలికల హాస్టల్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా వైద్యశిబిరాల్లో వైద్యాధికారి శివకుమార్ గ్రామస్తులు, విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైద్యసిబ్బంది రాంప్రసాద్, పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీలు హిమబిందు, అరుణ, రవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

**చంద్రుగొండ:** ఏపీలోని టీడీపీ ఎమ్మెల్యే రామకృష్ణంరాజుపై సత్వరమే చర్యలు తీసుకోవాలని మాలమహానాడు మండల అధ్యక్షుడు బడుగు శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ గోదావరి జిల్లా వీరులపాడు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి అంబేడ్కర్‌ను అగౌరవ పరిచిన రామకృష్ణంరాజుపై వేటువేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాయి రాజా, దాసరి రామారావు, ఇల్లంగి బాలకృష్ణ, బడుగు గణేష్, టి.ముక్తేశ్వరరావు, దాసరి వెంకటేష్, అరవింద్, వంశీ, మనోజ్ పాల్గొన్నారు.



